## క్లుప్తంగా

### నూతన జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్అర్బన్: తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కమిటీ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో గురువారం ఉర్దూ జర్నలిజం 200 ఏళ్ల చరిత్ర, భవిష్యత్‌పై ఉర్దూ మీడియా ఆధ్వర్యంలో జర్నలిజం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మీర్జా సలీంబేగ్, మహమ్మద్ మాజిద్ ఇక్బాల్‌ను ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌లు శాలువాతో సత్కరించారు. సంయుక్త కార్యదర్శిగా ఇక్బాల్, షరాఒద్దీన్, ఉపాధ్యక్షులుగా షౌకత్ ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఘూస్ మోయినొద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అమజత్‌అలీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

### పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రహీముద్దీన్

వాంకిడి: తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ నూతన క్యాలెండర్‌ను గురువారం తహసీల్దార్ రహీముద్దీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఉప్రె వినేష్ మాట్లాడుతూ దీర్ఘ కాలంగా నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అధ్యాపక సిబ్బందితో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి జగదీష్, కేజీబీవీ ఎస్‌వో తిరుమల ఉన్నారు.

### 15 మందికి కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేసుకున్న వారితో ఎస్సై

వాంకిడి: పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గతనెల డిసెంబర్ 23న వాంకిడి పోలీసుల ఆధ్వర్యంలో వసుద స్వచ్ఛంద సంస్థ సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుల సూచనల మేరకు సీఐ శ్రీనివాస్, ఎస్సై డోలకాసి సాగర్ ప్రత్యేకంగా దృష్టి సారించి లైయన్స్ క్లబ్ సహకారంతో గురువారం 15 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. పలువురికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకమై వారి ఇబ్బందుల్లో తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని తెలిపారు. అనంతరం కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆత్మీయ సమ్మేళనసభ జయప్రదం చేయండి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రంలో ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు సిడాం సకారాం కోరారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం సభా స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, ఎంపీటీసీ లంగారి శ్రీను, సహకార సంఘం మండల మాజీ వైస్ చైర్మన్ దందేర ఇస్తారి, సర్పంచ్ పార్తేటి రవి, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

దహెగాం: సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మండలంలో శుక్రవారం పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అనంతరం గోదాం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు.

# ‘దారి’చూపిన పోలీసులు

- గుండాల గ్రామానికి రోడ్డు నిర్మించిన ఖాకీలు
- తీరిన రహదారి కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు



నిర్మాణం చేపట్టక ముందు రోడ్డు పరిస్థితి



పోలీసులు నిర్మించిన మట్టి రోడ్డు

తిర్యాణి: ఆ గ్రామానికి వెళ్లాలంటే మూడు వాగులు దాటి ఆరు కిలోమీటర్లు దట్టమైన అటవీ ప్రాంతంలో కాలినడకన ప్రయాణించాల్సి ఉంటుంది. వానాకాలంలో గ్రామానికి బయ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. అధ్వానంగా ఉన్న రోడ్డు కారణంగా అత్యవసర సమయంలో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఆ గ్రామమే మండలంలోని గుండాల. గుండాల గ్రామపంచాయతీ పరిధిలో ఏడు ఆదివాసీ గూడేలు 850కి పైగా జనాభా ఉంది. వీరి దారి కష్టాలను తీర్చేందుకు పోలీసులు ముందుకొచ్చారు. మట్టి రోడ్డు సౌకర్యం కల్పించి గ్రామస్తుల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్నారు.

**రాళ్లను తొలచి.. రోడ్డు నిర్మించి..**

గుండాల గ్రామస్తులు నిత్యావసర సరుకుల కొనుగోళ్లు, వైద్యం, పింఛన్ వంటి అవసరాలకు మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. ఇందుకు ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ రొంపెల్లి గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి వాహనాల్లో మండల కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. కాగా దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో కాలినడక దారిలో పెద్ద బండలు ఉండేవి. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ సహకారంతో ఆరు కిలోమీటర్ల మేర పెద్ద బండలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంలో ప్రజలు సైతం భాగస్వాములయ్యారు. గూడానికి ఒకరోజు చొప్పున చిన్నా, పెద్ద తేడా లేకుండా శ్రమదానం నిర్వహించారు. నడకే అతికష్టంగా ఉన్న మార్గంలో ప్రస్తుతం నాలుగు చక్రాల వాహనాలు సైతం సులభంగా వెళ్తున్నాయి. కాగా ఇటీవలే ఈ రోడ్డును కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ సురేశ్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు ప్రారంభించారు.

#### కాలినడక బాధ తప్పింది



మా తాతల కాలం నుంచి ఎటు వెళ్లాలన్నా రోడ్డు లేకపోవడంతో కాలినడకనే వెళ్లే వాళ్లం. ఇటీవల పోలీసులు మా ఊరికి మట్టి రోడ్డు వేయడంతో నడక గోస తీరింది. ఇప్పుడు ఆటోలో వెళ్తున్నాం.

- మర్సుకోల అశోక్, గుండాల

#### రుణపడి ఉంటాం



ఏళ్లుగా రోడ్డు లేని మా గ్రామానికి పోలీసులు మట్టి రోడ్డు వేయడం చాలా సంతోషంగా ఉంది. పోలీసులకు ఎంతో రుణపడి ఉంటాం. గతంలో రేషన్ సరుకులను నెత్తిపై మోసుకుంటూ వచ్చే వాళ్లం. రోడ్డు నిర్మాణంతో నెత్తి మోపు బాధ తీరింది.

- తిరుపతి, గుండాల

#### ప్రజాశ్రేయస్సే ధ్యేయం



అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే పోలీసుల ధ్యేయం. గుండాల గ్రామస్తులు పడుతున్న బాధలను చూసి సమస్య పరిష్కారం కోసం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాం. ఎస్పీ సురేశ్ కుమార్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించడంతోనే రోడ్డు నిర్మాణం పూర్తయింది.

- రమేశ్, ఎస్సై, తిర్యాణి

# సబ్‌సెంటర్లు పూర్తయ్యేదెన్నడో?

- ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు
- పూర్తి చేయడంలో అధికారులు విఫలం
- గ్రామీణులకు అందని మెరుగైన వైద్యం



హత్తిని గ్రామంలో పునాది దశలోనే నిర్మాణం

దహెగాం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్‌సెంటర్ల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నా కిందిస్థాయి అధికారుల పట్టింపు లేని కారణంగా నిర్మాణాలు పూర్తి కావడం లేదు. మండలంలో ఏడు సబ్‌సెంటర్లు ఉన్నాయి. వీటి భవనాల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఎం కింద గత రెండేళ్ల క్రితం ఒక్కో భవనానికి రూ.16 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే భవన నిర్మాణాలు ప్రారంభమైనా పూర్తికావడం లేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**మండలంలో ఏడు సబ్‌సెంటర్లు..**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో దహెగాం, బీబ్రా, హత్తిని, పంబాపూర్, గిరవెల్లి, ఇట్యాల, కుంచవెల్లి సబ్‌సెంటర్లు ఉన్నాయి. సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతుండగా ఇట్యాల, బీబ్రా గ్రామాల్లోని సబ్‌సెంటర్ల భవనాలు పూర్తిచేసి రంగులు కూడా వేశారు. దహెగాం, కుంచవెల్లిలో పనులు కొనసాగుతున్నాయి. పంబాపూర్, హత్తిని గ్రామాల్లో ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. సబసెంటర్ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా సబ్‌సెంటర్లు అద్దెభవనాల్లో కొనసాగుతుండడంతో సరైన వసతులు లేక సిబ్బంది స్థానికంగా ఉండేందుకు జంకుతున్నారు. పక్కా భవనాలు, సరైన వసతులు ఉంటే స్థానికంగా ఉండడంతోపాటు మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశాలు ఉంటాయని వారు పేర్కొంటున్నారు.

**వైద్యుల నియామకం..**

కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఆయుష్మాన్ భారత్ కింద ప్రతీ సబ్‌సెంటర్‌కు వైద్యులను నియమించింది. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో వైద్యుడిని నియమించలేదు. కుంచవెల్లి సబ్‌సెంటర్ వైద్యురాలు ఇటీవల మంచిర్యాలకు బదిలీ అయ్యారు. దీంతో అక్కడ పోస్టు ఖాళీగా ఉంది. మిగతా సబ్‌సెంటర్లు బీబ్రా, ఇట్యాల, పంబాపూర్, హత్తిని, గిరవెల్లి సబ్‌సెంటర్లలో వైద్యులు ఉన్నారు. సబ్‌సెంటర్ భవనాలు పూర్తికాక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సబ్‌సెంటర్ల భవనాల పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

#### నెలరోజుల్లో పూర్తి చేస్తాం

సబ్‌సెంటర్ల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బీబ్రా, ఇట్యాలలో పనులు పూర్తయ్యాయి. చిన్నపాటి పనులు ఉన్నాయి. మిగతా చోట్ల కూడా పనులు నెల రోజుల్లోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. అందవెల్లి పెద్ద వాగుపై వంతెన కూలడంతో మెటీరియల్ ట్రాన్స్‌పోర్ట్‌కు ఇబ్బంది తలెత్తింది. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చాం.

- సందీప్‌రెడ్డి, ఏఈ

## పోడు రైతులందరికీ పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న చాంద్‌పాషా, నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: అర్హులైన గిరిజన, గిరిజనేతర పోడు రైతులందరికీ ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాటిలైట్ మ్యాప్, 75 ఏళ్ల ప్రామాణికత ఆధారంగా పోడు పట్టాలిస్తామనే నిబంధనను ఎత్తివేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన, గిరిజనేతరులకు పోడు భూములు దక్కకుండా కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అర్హులైన పోడు రైతులకు వెంటనే పట్టాలివ్వాలని పేర్కొన్నారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, ఎండీ జాఫర్, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రత్నం పోషం, ఐఎఫ్‌టీయూ డివిజన్ నాయకుడు రాంజీ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగజంకుల తిరుపతి, బోయిరె కళ్యాణ్ పాల్గొన్నారు.

## ‘ఉపాధి’ పనులు పకడ్బందీగా చేపట్టాలి



కౌటాలలో మాట్లాడుతున్న అధికారులు

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శశికళతో కలిసి పలు అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు చేయించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో చేపట్టే మన ఊరు–మన బడి పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, ఈజీఎస్ ఏపీఎం చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

**కూలీలకు పనులు కల్పించాలి**

కౌటాల: ఉపాధి హామీ కూలీలకు వందరోజుల పాటు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో నస్రుల్లాఖాన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిశాయని, గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి అందులో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచాలని, సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ విశ్వనాథ్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ పూర్ణిమ పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న రూ.3500 కోట్ల స్కాలర్‌షిప్‌తోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బొరే కల్యాణ్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు డబ్బులు కడితేనే తమ సర్టిఫికెట్లు ఇస్తామని, లేకపోతే ఇవ్వమని చెబుతుండడంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే స్కాలర్‌షిప్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీలు లేక అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారుతుందన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టీయూ మహాసభలు జయప్రదం చేయండి

వాంకిడి: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 11న నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఇన్‌చార్జి తిరుపతి కోరారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం మహాసభల కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వారి సమస్యలను విస్మరించి కనీసం గుర్తింపుకార్డులు ఇవ్వడం లేదని, ఒడిశా ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేసిందని, దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా ఉందని చెప్పుకునే ప్రభుత్వం క్రమబద్ధీకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, స్వీపర్, స్కావెంజర్, వంటవర్కర్లకు రక్షణ పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈమహాసభలకు నాన్‌టీచింగ్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ జిల్లా అధ్యక్షుడు దుర్వ శ్రీనివాస్, నాయకులు కవిత, శారద, వెంకటమ్మ, విజయకళ, సువర్ణ, నిర్మల, పార్వతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

## స్కీంల ప్రైవేటీకరణను ఆపాలి



డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న స్కీం వర్కర్లు

ఆసిఫాబాద్అర్బన్: వైద్యారోగ్యశాఖలో స్కీంల ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డికి తన కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు అవుతుందని, స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. స్కీం వర్కర్లను చట్ట పరిధిలోకి తీసుకురావడానికి నిరాకరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, గ్రామీణ ఉపాధి హామీ, ఎన్‌హెచ్‌ఎం, ఇతన స్కీంలు ఐకేపీ, వీవోఏ, సర్వశిక్షణ అభియాన్ తదితర 72 స్కీంలు దేశవ్యాప్తంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా స్కీంల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఇందులో భాగంగా శుక్రవారం దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. లోకేష్, స్వరూప, లింగయ్య, స్వప్న, పూజ, దూవత, కవిత, అమృత, దేవి, శోభ, జమున, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓసీపీలో నెల కొన్న సమస్యలను ప్రాజెక్టు అధికారితోపాటు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. షిఫ్టుల్లో మైనింగ్‌కు సంబంధించిన అధికారులు షిఫ్టు ఇన్‌చార్జీలుగా ఇద్దరు ముగ్గురిని నియమించి ఇంజినీరింగ్ విభాగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. యంత్రాలు నడుస్తున్నా ఒక్క ఇంజనీర్, ఫోర్‌మెన్ లేకుండానే షిఫ్టులు నడుపుతున్నారన్నారు. షిఫ్టు మొత్తం షిఫ్టు ఈపీ ఫిట్టర్, ఈపీ ఎలక్ట్రిషియన్ల మీదనే నడుస్తోందన్నారు. ఈ సమయంలో అనుకోని ప్రమాదం జరిగితే వారినే బాధ్యులను చేయడం సమంజసం కాదన్నారు. ఏరియాలో ఉన్న ఏకైక ఓసీపీలో షిఫ్టు ఫోర్‌మెన్, షిఫ్టు ఇంజనీర్‌తోపాటు ఈపీ ఫిట్టరకు పర్మినెంట్ హెల్పర్లు నియమించాలన్నారు. పూర్తిస్థాయిలో మ్యాన్ పవర్ నియమించి జనరల్ మజ్దూర్లపై పడుతున్న పనిభారాన్ని తగ్గించాలని కోరారు. సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, మారం శ్రీనివాస్, శేష శయన రావు, ఖైరిగూడ పిట్ కార్యదర్శి రాజేష్, నాయకులు శంకర్, సదాశివ్ పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

వాంకిడి(ఆసిఫాబాద్): ఇంటింటికీ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మండలంలోని జైత్‌పూర్ గ్రామంలో ‘స్వచ్ఛ భారత్ మిషన్’లో భాగంగా నిర్మించిన ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా రెండు గుంతలు తవ్వుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో సామూహిక ఇంకుడు గుంత నిర్మించి, క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌బీఎం కన్సల్టెంట్ సాయి, ఏపీఎం శ్రావణ్ కుమార్, ఈసీ జైహింద్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

## పాఠశాలలో టీఎల్‌ఎం మేళా



పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో సోమయ్య ఆధ్వర్యంలో గురువారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను మేళాలో ప్రదర్శించారు. ప్రజాప్రతినిధులు సందర్శించి వాటిని పరిశీలించారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ ఈర్ల సత్యానారాయణ, ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, ఉప సర్పంచ్ తోట మహేష్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, సీఆర్పీలు పవన్‌కుమార్, రాజేష్, సంతోష్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అజీజ్ పాల్గొన్నారు.

### ఫైలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

రెబ్బెన: మండలంలో ఫైలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. మండలంలోని గంగాపూర్‌లో బోదకాలి బాధితులకు వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎంఎండీపీ కిట్లను అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, సర్పంచ వినోద, ఎంపీటీసీ హరిత, వైద్యాధికారి సుజిత్ పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్: కేజీబీవీ యూఆర్ఎస్ నాన్‌టీచింగ్ వర్కర్స్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కేజీబీవీ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షురాలు భవానీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లుగా పనిచేస్తున్నా కేజీబీవీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, రమ్య పాల్గొన్నారు.

### 7న కార్యకర్తల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఈనెల 7న నిర్వహించే కార్యకర్తల సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. మండలంలోని నజ్రూల్‌నగర్‌లో గురువారం పార్టీ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీ నుంచి పర్చువల్ వేదికగా కార్యకర్తల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని సూచించారు. నగపూరి రాజమౌళి, బికాస్ గరామి, రణబీర్, సమీర్, అస్తోష్, ఆనంద్ పాల్గొన్నారు.

### ‘పార్టీని బలోపేతం చేయాలి’

తిర్యాణి: పార్టీని బలోపేతం కోసం కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని బీజేపీ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ సోల్లు లక్ష్మి అన్నారు. మండలంలోని వివిధ బూత్‌ల్లో గురువారం ఆమె పర్యటించారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను బూత్ కమిటీ అధ్యక్షులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ ఉన్నారు.

### క్రీడల్లో గెలుపోటములు సహజం

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుండాయిపేట గ్రామంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన గుండాయిపేట కమిటీ, గుండాయిపేట్ యూత్ జట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.